ఆంధ్రజ్యోతి


ANDHRAJYOTHY

5

శ్రీకాకుళం

జిల్లా వార్తలు

ఆదివారం 20 ఏప్రిల్ 2025



రేపటి నుంచి 'స్లాట్' రిజిస్ట్రేషన్లు

అరసవల్లి, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ఈ నెల 21 నుంచి జిల్లాలోని అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్లాట్ బుకింగ్ విధానంలో రిజిస్ట్రేషన్లు చేపట్టనున్నట్టు జిల్లా రిజిస్ట్రార్ నాగలక్ష్మి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతీరోజు ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5.30 వరకు స్లాట్‌లు బుక్ చేసుకునే వీలుందని, ప్రజలందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. దీనిపై సందేహాలు ఉంటే సమీపంలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు. ఎక్కడి నుంచైనా రిజిస్ట్రేషన్‌కు ఒక రోజు ముందుగా స్లాట్ బుకింగ్ చేసుకువాలని తెలిపారు.

మినీ గోవాగా.. బారువ

- పర్యాటక హబ్‌గా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు
- కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు
- ఘనంగా బీచ్ ఫెస్టివల్



సముద్రంలో బోటులో విహరిస్తున్న కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు. చిత్రంలో విప్ అశోక్, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి

బారువ బీచ్‌లో పడవల పోటీలు

సోంపేట, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛమైన పరిసరాలు, మహేంద్రతనయ నదీ సంగమం, లైట్‌హౌస్, ఎత్తయిన దిబ్బలు, సువిశాలమైన తీరం కలిగిన బారువ బీచ్‌ను మినీ గోవాగా తీర్చిదిద్దుతామని కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు తెలిపారు. సోంపేట మండలం బారువ తీరంలో శనివారం బీచ్ ఫెస్టివల్ ఘనంగా నిర్వహించారు. కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు ముఖ్య అతిథిగా హాజరై బీచ్ ఫెస్టివల్‌ను ప్రారంభించారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ప్రభుత్వ విప్ బెందాళం అశోక్‌తో కలసి బారువ తీరంలో ఆలివ్‌రిడ్లే తాబేళ్లను శనివారం విడిచిపెట్టారు. అనంతరం వివిధ క్రీడా విన్యాసాల కార్యక్రమాలను ప్రారంభించారు. స్పీడ్‌బోట్‌లో తీరం లోపల విహరించారు. స్వర్ణాంధ్ర -స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా.. సముద్ర తీరంలో పర్యావరణ పరిశుభ్రత చేపట్టారు. అనంతరం నిర్వహించిన సభలో కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు మాట్లాడుతూ.. 'బారువ బీచ్‌ను అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందేలా పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తాం. మినీగోవాగా తీర్చిదిద్దుతాం. ఈ సముద్ర తీరప్రాంతాన్ని పర్యాటక హబ్‌గా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం. భవిష్యత్‌లో నిర్వహించనున్న బీచ్ ఫెస్టివల్‌కు ఇది ట్రైలర్ మాత్రమే. ఇదే స్ఫూర్తితో వచ్చేనెల 3, 4 తేదీల్లో ఘనంగా బీచ్‌ఫెస్టివల్ నిర్వహిస్తాం. బారువ ప్రజలుకూడా సహకరించి బీచ్‌లో నిత్యం పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలి. పర్యాటకులను అక్కున చేర్చుకోవాలి' అని సూచించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 16 కేంద్రాల ద్వారా ఆలివ్‌రిడ్లే తాబేళ్ళ సంరక్షించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. బారువ బీచ్ ప్రత్యేకతను చాటిచెప్పేందుకు వెబ్‌సైట్, ప్రచార కార్యక్రమాలు ప్రారంభించామన్నారు. కార్యక్రమంలో ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి, జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, ఆర్డీవో వెంకటేశ్వరరావు, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.



బీచ్‌ఫెస్టివల్‌కు హాజరైన ప్రజలు



డీఎస్సీకి సిద్ధమవుతున్న యువత

మెగా డీఎస్సీ

నరసన్నపేట, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఎన్నికల్లో ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నారు. ఎన్నో ఏళ్లుగా ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి ఎదురుచూస్తున్న నిరుద్యోగులకు తీపి కబురు అందించారు. డీఎస్సీ నోటిఫికేషన్ జారీకి అనుమతి ఇస్తూ పాఠశాల విద్యాశాఖ శనివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. వైసీపీ హయాంలో ఐదేళ్ల పాటు ఒక్క పోస్టు కూడా భర్తీ చేయలేదు. ఎన్నికల ముందు మాత్రం హడావుడిగా డీఎస్సీ నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. తక్కువ ఉద్యోగాలకు ఇవ్వడంపై అప్పట్లో రాష్ట్ర వ్యాప్తంగా అభ్యర్థులు ఆందోళనలు చేశారు. తాము అధికారంలోకి వస్తే మెగా డీఎస్సీ ప్రకటిస్తామని ప్రచారంలో చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చారు. అనుకున్నట్లే సీఎం కాగానే డీఎస్సీ ఫైలుపై తొలి సంతకం చేశారు. ఆదివారం ఉదయం నోటిఫికేషన్ జారీ కానుంది. వయో పరిమితి కూడా గరిష్ఠంగా రెండేళ్ల పెంచడంతో అభ్యర్థులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

6లో



మాట్లాడుతున్న డీఎస్పీ వెంకట అప్పారావు (వృత్తంలో ఎరుపు టోపీ)

'ఆపరేషన్ రెడ్ క్యాప్' గుట్టురట్టు

- పలాసలో పది కిలోల గంజాయి స్వాధీనం

6లో

ఒడ్డుకు చేరిన బోట్లు

- సురక్షిత ప్రాంతాలకు వలలు
- స్వగ్రామాలకు చేరుకుంటున్న మత్స్యకారులు

ఎచ్చెర్ల, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి):

సముద్రంలో మోటారు, మరబోట్లతో చేపల వేట నిషేధం అమల్లోకి వచ్చింది. వేటకు విరామంతో మత్స్యకారులంతా బోట్లను ఒడ్డుకు చేర్చారు. వలలను సరి చేసుకుంటున్నారు. బోట్లు, వలలతోపాటు ఇతర సామగ్రిని సురక్షిత ప్రాంతాల్లో భద్రపరుస్తున్నారు. మరోవైపు గతేడాది జూలై, ఆగస్టు నెలల్లో గుజరాత్, కర్ణాటక తదితర ప్రాంతాలకు వలస వెళ్లిన మత్స్యకారులంతా చేపల వేట నిషేధం కారణంగా స్వగ్రామాలకు చేరుకుంటున్నారు. కాగా వేట నిషేధ సమయంలో తమకు ఆర్థిక ఇబ్బందులు తప్పడం లేదని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతేడాది వైసీపీ ప్రభుత్వం మత్స్యకార భరోసా ప్రకటించినా.. తమకు డబ్బులు ఇవ్వలేదని వాపోతున్నారు. ప్రస్తుత ప్రభుత్వం రెట్టింపు సాయంగా రూ. 20వేలు చొప్పున అందజేస్తామని ప్రకటించడంతో కాస్త ఊరట చెందుతున్నారు.

జిల్లాలో ఇదీ పరిస్థితి..

జిల్లాలోని ఎచ్చెర్ల, రణస్థలం, గార, శ్రీకాకుళం రూరల్, ఇచ్ఛాపురం, కవిటి, సోంపేట, మందస, వజ్రపుకొత్తూరు, సంతబొమ్మాళి, పోలాకి మండలాల్లో 104 సముద్ర తీర గ్రామాలు ఉన్నాయి. ఆరువేల మందికిపైగా మత్స్యకారులు వేటపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. సముద్రంలో చేపలు గుడ్లు పెట్టే దశలో మోటారు, మెకనైజ్డ్ బోట్లతో వేటాడితే మత్స్య సంపదకు తీవ్ర నష్టం వాటిల్లుతుంది. ఈ నేపథ్యంలో ఏటా రెండు నెలల పాటు.. సముద్రంలో చేపల వేట నిషేధాన్ని అమలు చేస్తున్నారు. ఈ నెల 14న అర్ధరాత్రి నుంచి చేపల వేట విరామం అమల్లోకి రాగా.. జూన్ 14 అర్ధరాత్రి వరకు ఇది కొనసాగనుంది. నిషేధాజ్ఞలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటారు. దీంతో మత్స్యకారులంతా వేటకు దూరమై.. బోట్లు, వలలు భద్రపరిచే పనిలో నిమగ్నమయ్యారు. ప్రభుత్వం సబ్సిడీ ఇవ్వడంతో జిల్లాలో మోటారు బోట్లతో చేపలు వేటాడేవారి సంఖ్య పెరిగింది. ప్రతీ తీర గ్రామంలో కూడా 20 వరకు మోటారు బోట్లు ఉన్నాయి. సుమారు రూ.3లక్షల విలువ చేసే ఫైబర్ బోటును ఇద్దరు, ముగ్గురు మత్స్యకారులు కలిసి కొనుగోలు చేసి చేపలు వేటాడుతుంటారు. ఒక్క బోటుపై సుమారు 8 మంది మత్స్యకారులు చేపల వేటకు వెళ్తుంటారు. వేట నిషేధం కావడంతో దాదాపుగా అందరికీ పనిలేకుండా పోయింది. ఈ పరిస్థితుల్లో చేపలు వేటపై జీవనం సాగిస్తున్నవారందరికీ భరోసా అందజేయాలని మత్స్యకారులు కోరుతున్నారు. అన్ సీజన్‌కావడంతో సంప్రదాయ తెప్పలతో వేటాడినా ఇబ్బందులను ఎదుర్కొంటున్నామని చెబుతున్నారు. ప్రస్తుతం కొంతమంది మత్స్యకార మహిళలు చెరువు చేపలను కొనుగోలు చేసి విక్రయించినా.. కష్టానికి తగిన ప్రతిఫలం రావడం లేదని ఆవేదన చెందుతున్నారు.



ఎచ్చెర్ల మండలం డి.మత్స్యలేశంలో ఒడ్డుకు చేర్చిన బోట్లు



వలలు అల్లుతున్న మత్స్యకారులు

పూర్తిస్థాయిలో ఉపాధి లేక..

తీర గ్రామాల్లో ఉపాధి పనులు అంతంత మాత్రంగానే జరుగుతున్నాయి. తీర ప్రాంతాల్లో చెరువులు, కాలువలు పూర్తిస్థాయిలో లేకపోవడంతో ఉపాధి పనులు చేపట్టేందుకు పెద్దగా అవకాశం ఉండడంలేదు. జాబ్ కార్డు ఉన్న ఒక్కో కుటుంబానికి 40 నుంచి 50 రోజులకు మించి ఉపాధి పనులు కల్పించని పరిస్థితి ఉంది. పక్క గ్రామాలకు వెళ్లి ఉపాధి పనుల్లో పాల్గొందామన్నా వెళ్లి రావడం (మిగతా 6వ పేజీలో..)

జేఈఈ మెయిన్స్‌లో సత్తా

- జిల్లా విద్యార్థులకు ఉత్తమ ర్యాంకులు

ఎచ్చెర్ల, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయిలో ఇంజనీరింగ్ చదివేందుకు ఎన్ఐటీలో ప్రవేశాలకు నిర్వహించే జేఈఈ మెయిన్స్ పరీక్షలో జిల్లా విద్యార్థులు సత్తా చాటారు. ఉత్తమ ర్యాంకులతో ప్రతిభ చూపారు. ఎచ్చెర్ల మండలం అల్లినగరం గ్రామానికి చెందిన బుడుమూరు విక్రమరాజా 100కు 99.9976 మార్కులతో ఓపెన్‌లో 64, ఓబీసీ కేటగిరీలో ఆరో ర్యాంకు సాధించాడు. ఈ విద్యార్థి విశాఖ పట్నంలో ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్మీడియట్ సీబీఎస్ సిలబస్‌లో చదవ గా, ఇంకా ఫలితాలు రావల్సి ఉంది. ముంబై ఐఐటీలో సీఎస్ఈ బ్రాంచ్‌లో ఇంజనీరింగ్ పూర్తిచేయాలన్నదే తన లక్ష్యమని విక్రమరాజా తెలిపాడు. ఈయన తండ్రి సోమరాజు ప్రభుత్వ ఉపాధ్యాయుడు కాగా, తల్లి కళ్యాణి స్థానికంగా ఓ ప్రైవేటు స్కూల్‌ను నిర్వహిస్తున్నారు.



విక్రమరాజా- 64వ ర్యాంకు

- నరసన్నపేట మండలం దేవాది గ్రామానికి చెందిన ధర్మాన జ్ఞాన రుత్విక్‌సాయి ఆలిండియా స్థాయిలో ఓపెన్ కేటగిరీలో 294వ ర్యాంకు, ఓబీసీ విభాగంలో 38వ ర్యాంకు సాధించాడు. 99.98 పర్సంటైల్ స్కోరు చేశాడు. రుత్విక్ విజయవాడలోని ప్రైవేటు కళాశాలలో ఇంటర్ చదవ గా.. 987 మార్కులతో ఉత్తీర్ణత పొందాడు. ముంబై ఐఐటీలో కంప్యూటర్ ఇంజనీరింగ్ చేయడమే తన లక్ష్యమని రుత్విక్ తెలిపాడు. రుత్విక్ తండ్రి ధర్మాన శంకరనారాయణ, తల్లి లత ఉపాధ్యాయులు.



జ్ఞాన రుత్విక్‌సాయి - 294వ ర్యాంకు

మరిన్ని వివరాలు 8లో

మహిళ దారుణ హత్య

- కత్తితో దాడిచేసి పరారీ
- దర్యాప్తు చేస్తున్న పోలీసులు

8లో

రాళ్లు వేశారు.. రోడ్డు మరిచారు

- ప్రమాదాలకు నిలయంగా మారిన జగతి-శిలగాం రహదారి

ఆదిత్యాలయంలో దళారుల దందా!

- ప్రత్యేక దర్శనాల పేరిట డబ్బుల వసూలు
- పట్టించుకోని అధికారులు

అరసవల్లి, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): అరసవల్లిలోని ఆదిత్యాలయంలో దళారుల దందా సాఫీగా సాగిపోతోంది. కొంతమంది మధ్యవర్తులుగా వ్యవహరిస్తూ ప్రత్యేక దర్శనాల పేరిట భక్తుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారు. బయట వ్యక్తులు ఆలయంలో పనిచేస్తున్న దినసరి వేతన సిబ్బందికి, పర్మినెంట్ ఉద్యోగుల్లో కొందరికి ఫోన్ చేస్తారు. ఫలానా ఉద్యోగి తాలుకా కుటుంబ సభ్యులు వస్తున్నారు... వారిని దర్శనాలకు అనుమతించాలని చెబుతారు. అప్పటికే సంబంధిత భక్తులు ఆలయ ముఖద్వారం గేటు వద్దకు చేరుకుంటారు. వారిని ఆలయ సిబ్బంది నేరుగా అనివెట్టి మండపంలోంచి స్వామి దర్శనానికి తీసుకువెళతారు. ప్రత్యేకంగా ఈ తతంగం అంతా ఆదివారం నాడు జరుగుతోంది. ఈ విషయం ఆలయ ఉద్యోగులకు, సామాన్య భక్తులందరికీ తెలిసినా.. ఉన్నతాధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. ఆలయ అధికారి తగినంత సమయం ఆలయంలో ఉండకపోవడం, ఒకరిద్దరు పర్మినెంట్ ఉద్యోగులకు కూడా వసూళ్లలో వాటాలు అందుతుండడంతో ఈ దందా సజావుగా సాగిపోతోందనే ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికే ఆరోపణలు ఎదుర్కొంటున్న ఇద్దరు దినసరి ఉద్యోగులు (ప్రస్తుతానికి ఆలయానికి రావడం లేదు) ఫోన్ ద్వారా ఆలయ ఉద్యోగితో కాంటాక్ట్‌లో ఉంటూ, ప్రొటోకాల్ దర్శనాల్లో ముఖ్యపాత్ర పోషిస్తున్నారని, వారికి ఆలయ ఉద్యోగి ఒకరు సహకరిస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నా యి. ప్రతీ ఆదివారం మధ్యాహ్నం ఒంటిగంటన్నర తరువాత స్వామి దర్శన టిక్కెట్ల అమ్మకం ఆగి పోతుంది. దీంతో దళారుల పని మరింత సులువుగా మారుతుంది. నిజానికి సాయంత్రం వరకు ప్రత్యేక దర్శనానికి సంబంధించి టిక్కెట్లను అందుబాటులో ఉంచితే కొంతవరకైనా ఈ అక్రమ వసూళ్లను అరికట్టవచ్చని భక్తులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా ఆలయ అధికారులు ఈ విషయంపై దృష్టి సారించి అక్రమ వసూళ్ల దందాకు అడ్డుకట్ట వేయాలని కోరుతున్నారు.



ఆదిత్యాలయం



సందడిగా బీచ్ ఫెస్టివల్



వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు. చిత్రంలో విప్ అశోక్, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి



బారువ తీరంలో తాబేళ్ల పిల్లలను విడిచిపెడుతున్న కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు, విప్ అశోక్ తదితరులు

సోంపేట, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి):

సోంపేట మండలం బారువ తీరంలో బీచ్ ఫెస్టివల్ శనివారం సందడిగా సాగింది. అధిక సంఖ్యలో ప్రజలు తరలిరావడంతో బారువ తీరం జన సంద్రంగా మారింది. కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు ముఖ్య అతిథిగా హాజరై బీచ్ ఫెస్టివల్‌ను ప్రారంభించారు. శనివారం ఉదయం 5.30 గంటలకే కేంద్రమంత్రితోపాటు విప్ బెందాళం అశోక్ బీచ్‌కు చేరుకుని.. పర్యాటకులతో ముచ్చటించారు. సముద్రంలో ఆలివ్‌రిడ్లే తాబేళ్ల పిల్లలను విడిచిపెట్టారు. కబడ్డీ, వాలీబాల్, పడవ పోటీలను నిర్వహించారు. బోటు షికారులో విహ రించారు. గాలిపటాలు ఎగరేశారు. సముద్రంలో అపాయం ఎదురైతే.. ఎలా రక్షించాలో డెమో ద్వారా పర్యాటకులకు నేవీ అధికారులు వివరించా రు. మరోవైపు సాంస్కృతిక నృత్యప్రద ర్శనలతో బీచ్‌లో ఎక్కడ చూసినా సందడి కనిపించింది. బారువ ఎంపీపీ పాఠశాల విద్యార్థులు రూపొందించిన ఆలివ్‌రిడ్లే తాబేలు సైకత శిల్పం విశేషంగా ఆకట్టుకుంది.



ఆకట్టుకున్న సాంస్కృతిక నృత్య ప్రదర్శన



ఆకట్టుకున్న ఆలివ్‌రిడ్లే సైకత శిల్పం



బీచ్‌ఫెస్టివల్‌కు హాజరైన ప్రజలు



సముద్రంలో అపాయం నుంచి రక్షించేందుకు డెమో..



కబడ్డీ పోటీలు..



ఎలక్ట్రానిక్ వ్యర్థాలపై కేంద్రమంత్రికి వివరిస్తున్న శ్రీకాకుళం పాల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ కరుణశ్రీ

బెల్లుపడలో యజ్ఞం ప్రారంభం



బెల్లుపడ గ్రామంలో ఏర్పాటు చేసిన విగ్రహాలు

ఇచ్ఛాపురం, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): పాంచాహ్నిక పంచకుండాత్మక శ్రీరామ తారక మహామంత్ర యజ్ఞం బెల్లుపడ గ్రామంలో ఘనంగా ప్రారంభమైంది. శనివారం ఉదయం నుంచి వేదపండితులు విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, రక్షాబంధనం, అంకురారోపణ, మృత్సంగ్రహణం, మండప ఆవాహనాలు చేశారు. అనంతరం అగ్నిప్రతిష్ఠ, హోమాలు జరిగాయి. యజ్ఞం సందర్భంగా గ్రామంలో ప్రత్యేకంగా తయారు చేసిన రాధాకృష్ణుడు, హనుమాన్, సీతారామలక్ష్మణ విగ్రహాలను ఏర్పాటు చేశారు. ఇవి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. వీటిని భక్తులు ఆసక్తితో తిలకిస్తున్నారు. రాధాకృష్ణ మందిరం వద్ద హరేరామ హరేకృష్ణ బృందంతో ప్రత్యేకంగా భజన కార్యక్రమం నిర్వహించారు. మధ్యాహ్నం ఏర్పాటు చేసిన అన్న ప్రసాద వితరణ కార్యక్రమంలో వందలాది మంది భక్తులు పాల్గొన్నారు.



ఒడ్డుకు చేరిన బోట్లు

(ఐదో పేజీ తరువాయి)

కష్టమవుతోందని మత్స్యకారులు చెబుతున్నారు. ప్రభుత్వం స్పందించి పూర్తిస్థాయిలో ఉపాధి పనులు కల్పించాలని మత్స్యకారులు కోరుతున్నారు. అలాగే అర్హులందరికీ మత్స్యకార భరోసా సాయం అందజేసేలా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

గతేడాది భరోసా ఇవ్వలేదు..



గతేడాదికి సంబంధించి మత్స్యకార భరోసా ఇవ్వలేదు. ఈ రెండేళ్ల కలిపి ఒకేసారి భరోసా మొత్తం అందజేస్తే మత్స్యకార కుటుంబాలకు ఎంతో ఊరట కలుగుతుంది. మర, మోటారు బోట్లలో వేట నిషేధంతో సంప్రదాయ తెప్పలపై వేటాడి ఉపాధి పొందాలి.

-గనగళ్ల అప్పన్న, మత్స్యకారుడు, డి.మత్స్యలేశం

ప్రభుత్వమే ఆదుకోవాలి..



2 నెలలపాటు సముద్రంలో చేపల వేట నిషేధించారు. వేరే ప్రాంతాలకు వెళ్లి పనులు చేసుకునేందుకు మదుపు పెట్టే పరిస్థితిలో లేము. ప్రభుత్వమే మత్స్యకార కుటుంబాలను ఆదుకోవాలి. నిషేధం సమయంలో గతంలో మాదిరిగా బియ్యాన్ని పంపిణీ చేయాలి.

-మైలపల్లి రాజు, మత్స్యకారుడు, డి.మత్స్యలేశం

రేపు, ఎల్లుండి కంచి విశ్వవిద్యాలయ ప్రవేశాల ప్రక్రియ

శ్రీకాకుళం కల్చరల్ ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): కంచి విశ్వవిద్యాలయ ప్రవేశాలు ఈ నెల 21న విశాఖపట్నం శంకరమఠంలో నిర్వహించనున్నట్టు శ్రీకంచి కామకోటి శంకర మఠం అధ్యక్షుడు డాక్టర్ టి.రవి రాజు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 21న విశాఖపట్నం ద్వారకానగర్ శంకర మఠంలో, 22న విజయనగరంలోని సన్ స్కూల్ ఆవరణలో, అదేరోజు శ్రీకాకుళంలోని గాయత్రి స్కూల్, గీతాంజలి స్కూల్ ఆవరణలోనూ ప్రవేశ ప్రకియ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, స్పాట్ అడ్మిషన్ల ప్రక్రియలో పాల్గొనేందుకు యూనివర్సిటీ వీసీ ఆచార్య గుళ్లపల్లి శ్రీనివాస్, వైస్ చాన్సలర్లు కె.వెంకట రమణన్. డి.నాగేశ్వరరావు, డీన్ సిబ్బంది రానున్నట్లు తెలిపారు.

'ఆపరేషన్ రెడ్ క్యాప్' గుట్టురట్టు

● పలాసలో గంజాయి ముఠా నుంచి పది కిలోల స్వాధీనం

పలాస, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): గూఢాచారి సినిమాలో స్మగ్లర్లు సరకులు గమ్యస్థానానికి చేర్పించేందుకు రకరకాల వేషాలు వేస్తుంటారు. సరుకులు అందించే వారి వివరాలు వెల్లడించకుండా టోపీలు, దుస్తులు వంటి ఐడెంటింటీని చెబుతూ వారికి సరకులు అప్పగిస్తూ చాకచక్యంగా వ్యవహరిస్తుంటారు. అచ్చం ఆ సినిమా మాదిరిగానే గంజాయి స్మగ్లర్లు ఆపరేషన్ రెడ్‌క్యాప్ పేరుతో నిర్వహించిన ఆపరేషన్‌ను కాశీబుగ్గ పోలీసులు గుట్టురట్టుచే శారు. శనివారం సాయంత్రం పలాస రైల్వే స్టేషన్ రోడ్డులో పది కిలోల గంజాయి తరలిస్తున్న ఇద్దరు ఒడిశావాసులను పట్టుకున్నారు. కాశీబుగ్గ డీఎస్పీ వి.వెంకట అప్పారావు కథనం మేరకు.. ఒడిశాలోని ఆర్.ఉదయగిరికి చెందిన తపన్‌బెబర్త, మననిత్‌సింగ్‌లు క్రికెట్‌లో పరిచయమై స్నేహితులుగా మారారు. వీరు చెడువ్యవసనాలకు బానిసై గంజాయి రవాణాకు అలవాటు పడ్డారు. హైదరాబాద్‌లో అమ్మకందారులకు గంజాయిఇస్తే రూ.10వేలు కమీషన్ వస్తుండడంతో ఆ స్మగ్లింగ్‌కు అలవాటుపడ్డారు.ఈ క్రమంలో ఇద్దరూ గంజాయి కొను గోలు చేసుకొని పలాస రైల్వే స్టేషన్‌కు చేరుకున్నాడు. గంజాయి అమ్మకందారులు పలాసలో రైల్వే స్టేషన్‌కు రావడంతో వారిని గుర్తించడానికి ఆనవాళ్లు చెప్పడంతో ఆ విధంగా గంజాయిని ఇచ్చేందుకు సిద్ధమయ్యారు. ఈ క్రమంలో ఎరుపు రంగు టోపీ వ్యక్తికి గంజాయి బ్యాగును ఇవ్వాల్సి ఉంది. ఆ క్రమంలో ఎరుపు టోపీ వ్యక్తికోసం వెతుకుతుండడంగా తనిఖీలు నిర్వహిస్తున్న కాశీబుగ్గ సీఐ పి.సూర్యనారాయణ, సిబ్బంది కంట పడ్డారు. వెంటనే బ్యాగులను పరిశీలించగా గంజాయి బయట పడింది. విషయం ఆరా తీయడంతో ఆపరేషన్ రెడ్ క్యాప్ వ్యవహారం గుట్టురట్టయ్యింది.దీంతో పోలీసులు వారి తెలివితేటలకు విస్తుపోయారు. నిందితులను అరెస్టు చేసి పలాస కోర్టులో హాజరుపరచగా 14 రోజులు రిమాండ్ విధించారు. గంజాయి ముఠాను పట్టుకున్న పోలీసులకు డీఎస్పీ అభినందించారు.

పునరుత్థాన ర్యాలీ

శ్రీకాకుళం కల్చరల్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): క్రైస్తవ ఆరాధన కేంద్రం, తెలుగు బాపిస్ట్ చర్చి ఆధ్వర్యంలో శనివారం పునరుత్థాన ర్యాలీ నిర్వహించారు. సూర్యమహల్ జంక్షన్ నుంచి తెలుగు బాపిస్ట్ చర్చి వరకు ప్రార్థనలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంబేడ్కర్, శాంతి, చిన్నా, జోసెఫ్, డేనియల్, రెవ.ప్రేమ్‌కుమార్, అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.





వేంకటేశ్వర స్వామికి ప్రత్యేక అలంకరణ

శ్రీకాకుళం కల్చరల్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక దూదివారి వేంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామికి తులసి మాలలతో శనివారం ప్రత్యేకంగా అలంకరించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు.

ప్రతి నియోజకవర్గంలో గ్రీవెన్స్

● రైల్వేశాఖ వద్ద తాళభద్ర రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి ప్రతిపాదనలు
● కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు

పలాస, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రజల సమస్యల పరిష్కారం కోసం ప్రతి నియోజకవర్గం కేంద్రంలో గ్రీవెన్స్ నిర్వహించనున్నామని కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు తెలిపారు. శనివారం పలాస టీడీపీ కార్యాలయంలో గ్రీవెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతినెలా నిర్వహించే గ్రీవెన్స్‌లో వచ్చిన ఫిర్యాదులు సత్వ రమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటా మన్నారు. పలాస నియోజ కవర్గంలో నెలలో ఒకరోజు ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహిస్తామని, ఇక్కడున్న సమస్యలపై ప్రత్యేక దృష్టి సారిస్తామని తెలిపారు. మునిసిపాలిటీకి తన నిధులు రూ.కోటి కేటాయించామని, పనులు కూడా పూర్తయ్యే దశలో ఉన్నాయని చెప్పారు. కాశీబుగ్గ ఫ్లైఓవర్‌బ్రిడ్జి నిర్మాణానికి రైల్వేశాఖ రూ.48 కోట్లు మంజూరు చేయడంతో పనులు త్వరలో ప్రారంభిస్తామన్నారు. తాళభద్ర రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జికి కూడా మోక్షం కలుగుతుందని, ఇందుకు సంబం దించిన ప్రతిపాదనలు రైల్వేమంత్రిత్వశాఖ వద్ద ఉన్నాయని చెప్పారు.



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు

ఎయిర్‌పోర్టు నిర్మాణానికి అనుమతులు..

ఎయిర్‌పోర్టు నిర్మాణానికి అనుమతులు లభించాయని, స్థల సేకరణ పూర్తయితే నిర్మాణం జరుగుతుందని, ప్రజలు అభివృద్ధికి సహకారం అందించాలని కోరారు. జీడి, కొబ్బరి రైతుల సమస్యలు పరిష్కరిస్తామని, జీడి పరిశో ధన కేంద్రం నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామని, స్థలం కోసం అన్వేషిస్తున్నామని తెలిపారు.అనంతరం పలాసనియోజక వర్గం నలుమూలలనుంచి వచ్చినవారు తమ సమస్యలపై వినతిపత్రాలు అందజేశారు. వినతుల నునమోదుచేసుకొని పరిష్కరిస్తామని మంత్రి చెప్పారు. కార్యక్రమంలో పలాస నియోజకవర్గం టీడీపీ సమన్వయకర్త యార్లగడ్డ వెంకన్నచౌదరి, ఏపీటీపీసీ చైర్మన్ వజ్జ బాబూరావు, రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి లొడగల కామేశ్వర రావుయాదవ్, పీరుకట్ల విఠల్‌రావు, గురిటి సూర్యనారాయణ, టంకాల రవిశంకర్‌గుప్తా, బడ్డ నాగరాజు, సప్ప నవీన్, గాలి కృష్ణారావు, ఎ.రామకృష్ణ పాల్గొన్నారు.

మెగా డీఎస్సీ

● నోటిఫికేషన్ జారీకి అనుమతిస్తూ విద్యాశాఖ ఉత్తర్వులు
● జిల్లాలో 543 పోస్టుల భర్తీ ● నిరుద్యోగుల్లో ఆనందోత్సాహాలు

నరసన్నపేట, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల హామీ మేరకు ఇటీవల మంత్రివర్గ సమావేశంలో సీఎం చంద్రబాబు ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. తాజాగా శనివారం డీఎస్సీ నోటిఫికేషన్ జారీకి అనుమతిస్తూ పాఠశాల విద్యాశాఖ ఉత్తర్వులు జారీచేసింది. అందుకు అనుగుణంగా ఆదివారం ఉదయం నోటిఫికేషన్ విడుదల కానుంది. దీంతో నిరుద్యోగుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లపాటు ఉపాధ్యాయ పోస్టుల భర్తీని విస్మరించింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మెగా డీఎస్సీ ప్రకటించింది. రాష్ట్రవాప్తంగా 16,347 ఉద్యోగాల భర్తీకి సన్నాహాలు చేసింది. టెట్ నిర్వహించి నవంబరులోనే ఫలితాలు ప్రకటించింది. ఇటీవల సీఎం చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ శాసనసభ, శాసనమండలి సమావేశాల్లో జూన్‌నాటికి పోస్టుల భర్తీని పూర్తి చేస్తామని ప్రకటించారు. తాజాగా నోటిఫికేషన్ జారీకి అనుమతిచ్చారు. ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో పాఠశాల విద్యాశాఖ విభాగానికి సంబంధించి 458 ఉపాధ్యాయ ఉద్యోగాలను డీఎస్సీ ద్వారా భర్తీ చేయనున్నారు. అలాగే ట్రైబల్ వెల్ఫేర్ ఆశ్రమ్ ద్వారా మరో 85 పోస్టులు మొత్తంగా 543 ఉద్యోగాలు భర్తీ చేయనున్నారు.

● ప్రభుత్వ, జడ్పీ, ఎంపీపీ యాజమాన్యం పరిధిలోగల పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌కు సంబంధించి తెలుగు 31, హిందీ- 11, ఇంగ్లీషు-64, గణితం -33, భౌతికశాస్త్రం- 14, బయాలజీ -32, సోషల్ -66, ఫిజికల్ ఎడ్యుకేషన్ -81, ఎస్జీటీలు -72 పోస్టులు మొత్తం 407 భర్తీ చేయనున్నారు. అలాగే మునిసిపాలిటీ పరిధిలోని పాఠశాలలో తెలుగు -3, హిందీ- ఒకటి, ఇంగ్లీషు - ఒకటి, బయాలజీ- ఒకటి, సోషల్ -5, ఫిజికల్ ఎడ్యుకేషన్ -1, ఎస్జీటీలు -39 మొత్తం 51 పోస్టులు ఉన్నాయి.

● ట్రైబల్ వెల్ఫేర్‌కు సంబంధించి ఇంగ్లీష్ -12, మ్యాథ్స్ -13, పీఎస్ -10, బయాలజీ-12, సోషల్ -5, ఎస్జీటీ -33 చొప్పున 85 పోస్టులు భర్తీ కానున్నాయి.

సాగునీరు సరఫరాకు ప్రతిపాదనలివ్వండి: ఎమ్మెల్యే



నారాయణపురం కాలువ విషయమై చర్చిస్తున్న ఎమ్మెల్యే ఈశ్వరరావు

ఎచ్చెర్ల, ఏప్రిల్ 19 (ఆంధజ్యోతి): వచ్చే ఖరీఫ్ నాటికి నారాయణపురం కుడి కాలువ ద్వారా సాగునీటి సరఫరాకు అవసరమైన పనులను ప్రతిపాదించాలని ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు అన్నారు. కూటమి నేతలు, ఇంజనీరింగ్ అధికారులతో కలిసి నారాయణపురం కాలువను శనివారం ఆయన పరిశీలించారు. నారాయణపురం ఆనకట్ట వద్ద నుంచి కిలోమీటరు వరకు ఉన్న ఇసుక మేటలను తొలగించాలన్నారు. మంతెన, గోకర్ణపల్లి వద్ద గుర్రపు డెక్కను తొలగించాలన్నారు. సంతకవిటి, పొందూరు, ఎచ్చెర్ల మండలాల పరిధిలో కాలువను పరిశీలించారు. తాత్కాలిక, శాశ్వత ప్రాతిపదికన పనులకు అంచనాలు రూపొందించాలన్నారు. ఈ నెల 22న జిల్లాకు వస్తున్న మంత్రి నిమ్మల రామానాయుడు దృష్టికి తీసుకెళ్లి కాలువ పనులు జరిగేలా కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో జల వనరుల శాఖ డీఈఈ రవీంద్రనాయుడు, ఏఈ కె.రాంబాబు, జిల్లా టీడీపీ మాజీ అధ్యక్షుడు చౌదరి నారాయణమూర్తి, నారాయణపురం ప్రాజెక్ట్ కమిటీ ఉపాధ్యక్షుడు పంచిరెడ్డి కృష్ణారావు, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పైడి వేణుగోపాలం, మండల టీడీపీ అధ్యక్షుడు బెండు మల్లేశ్వరావు, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ అన్నెపు భువనేశ్వరరావు, కూటమి నేతలు పంచిరెడ్డి సత్యనారాయణ, సంపతిరావు నాగేశ్వరరావు, గాలి వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి వార్షికోత్సవాలు

జి.సిగడాం, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): చెట్టుపొదిలాంలో వెలసిన షిర్డిసాయి ఆలయ తృతీయ వార్షికోత్సవం సోమవారం నుంచి నిర్వహించనున్నట్టు ఆలయ ధర్మకర్త భూపతి అర్జున్ కుమార్ తెలిపారు. ఈ ఉత్సవాలను మూడు రోజుల పాటు నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈసందర్భంగా వివిధ పోటీలు, సాంస్కృతిక ప్రదర్శనలు ఏర్పాటు చేయనున్నట్టు చెప్పారు.

తులసిగాంలో సంబరాలు

ఇచ్ఛాపురం, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): తులసిగాం గ్రామంలో గత మూడు రోజులుగా అమ్మవారి సంబరాలు వేడుకగా జరుగుతున్నాయి. ఆలయ పునః ప్రారంభం సందర్భంగా శ్రీ వేంకటేశ్వర డ్యాన్స్ అకాడమి చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి.

రేపు ఆదర్శ పాఠశాలలో ప్రవేశానికి పరీక్ష

ఎచ్చెర్ల, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): కుప్పిలి ఆదర్శ పాఠశాల/కళాశాలలో ఆరో తరగతిలో 2025-26 విద్యా సంవత్సరంలో ఆరో తరగతిలో ప్రవేశానికి ఈ నెల 21న పరీక్ష నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపాల్ కె.అప్పాజీరావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ప్రవేశ పరీక్ష జరుగుతుందన్నారు. ఉదయం 9 గంటలకే విద్యార్థులు పరీక్షా కేంద్రానికి హాజరుకావాలన్నారు. దరఖాస్తు చేసిన విద్యార్థులు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ డాట్ సీఎస్ఈ డాట్ ఏపీ డాట్ జీవోవీ డాట్ ఇన్ వెబ్‌సైట్ నుంచి హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. హాల్‌టికెట్, గుర్తింపు కార్డు, నీలం లేదా నలుపు పెన్నులతో విద్యార్థులు హాజరు కావాలని సూచించారు.

అప్రమత్తతతోనే అగ్ని ప్రమాదాల నివారణ



సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

ఇచ్ఛాపురం, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): అప్రమత్తతోనే అగ్ని ప్రమాదాలను నివారించవచ్చునని ఫైర్ అదికారి ప్రశాంత్ కుమార్ అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా శనివారం సీహెచ్‌సీ వద్ద డాక్టర్లు, వైద్య సిబ్బందికి అగ్నిప్రమాదాల నివారణకు చేపట్టాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. సీపీఆర్ ఎలా చేయాలో ప్రయోగాత్మకంగా చూపించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరెండెంట్ పాతిర్ల దేవేంద్రరెడ్డి, ఫైర్ సిబ్బంది సూర్యారావు, కామరాజు, ప్రసాద్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ఈకేవైసీ త్వరగా పూర్తి చేయాలి

గార, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఇంకా ఈకేవైసీ చేసుకోని వారు తప్పనిసరిగా చేయించుకోవాలని తహశీల్దార్ ఎం.చక్రవర్తి అన్నారు. శనివారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో డీలర్లు, ఎం.డి.ఎం. ఆపరేటర్లు, వి.ఆర్.ఒ.లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో పౌర సరఫరాల డి.టి. చక్రవర్తి, ఆర్.ఐ. రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

ఇచ్ఛాపురం, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): మంచి పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమవుతుందని ఐసీడీఎస్ పీఓ నాగరాణి అన్నారు. పోషణ పక్వాడా కార్యక్రమంలో భాగంగా శనివారం అవగహన కార్యక్రమాలు నిర్వహించారు ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ నీలవేణి, 3వ వార్డు కౌన్సిలర్ పత్రి తవిటయ్య, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి సాలిన ఢిల్లీ, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మంచి భవిష్యత్తు

సరుబుజ్జిలి, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకున్న విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఎంఈవో కంచరాపు శ్రీనివాసరావు తెలిపారు. శనివారం మూలసవలాపురం, తురకపేట గ్రామాల్లో ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల ఇళ్లకు వెళ్లి ప్రభుత్వ పాఠశాలల్లో చేరడం వల్ల కలిగే ప్రయోజనాలను తల్లిదం డ్రులకు వివరించారు. ఈ కార్య క్రమంలో సీఆర్‌పీ ఎ.చిరంజీవి పాల్గొన్నారు.

రేపు ధర్నా

ఆమదాలవలస, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): ఈనెల 21న తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నాను పెన్షనర్లు విజయవంతం చేయాలని ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసో సియేషన్ ప్రధాన కార్య దర్శి బొడ్డేపల్లి జనార్దనరావు ఒక ప్రకటనలో కోరారు. సమస్యలపై నినదిస్తామన్నారు.

బెంగాల్ అల్లర్ల దోషులను వదలొద్దు



కలెక్టరేట్ వద్ద ధర్నాలో పాల్గొన్న వీహెచ్‌పీ నాయకులు

శ్రీకాకుళం కలెక్టరేట్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): వక్ఫ్ చట్ట సవరణలకు నిరసనగా పశ్చిమ బెంగాల్‌లో జరుగుతున్న అల్లర్లలో అమాయక హిందువులు ప్రాణాలు కోల్పోయారని, 500 హిందూ కుటుంబాలు ఊరు వదిలి వెళ్లిపోయారని విశ్వహిందూ పరిషత్ నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. దీనికి కారకులైనవ వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు శనివారం కలెక్టరేట్ వద్ద నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బెంగాల్‌లో ల్యాండ్ జిహాదీలను ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి వెనకేసుకు వస్తున్నారని ఆరోపించారు. అరాచక శక్తులతో చేతులు కలిపి అల్లర్లను రాష్ట్రవ్యాప్తం చేసేందుకు సహకరిస్తున్నారని విమర్శించారు. ఈశాన్య రాష్ట్రాల్లో దేశ వ్యతిరేక శక్తుల విజృంభణకు మమతా బెనర్జీ ఆజ్యం పోస్తున్నారని అన్నారు. బెంగాల్‌లో రాష్ట్రపతి పాలన విధించాలని, హింస దేశమంతా వ్యాప్తి చెందకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని కోరారు అనంతరం కలెక్టర్ కార్యాలయంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వేంకటేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు లోకనాథం ఆనందరావు, ఉపాధ్యక్షుడు శ్రీరంగం మధుసూధనరావు, గొద్దు భాస్కర్, కార్యదర్శి గేదెల చంద్రశేఖర్, కోశాధికారి టంకాల సూరప్పడు, భజరంగదళ్ సంయోజక్ కిరణ్‌కుమార్, ధర్మవరపు ఆచారి, బీజేపీ నాయకులు, ఆరెస్సెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు ఇళ్ల పట్టాల పంపిణీ



లబ్ధిదారులకు పట్టాలు అందజేస్తున్న ఎమ్మెల్యే అశోక్

ఇచ్ఛాపురం, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): ఈదుపురం పర్యటనలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీ మేరకు నిరుపేదలకు ఇళ్ల పట్టాలు, రేషన్ కార్డులు మంజూరు చేసి అందించినట్టు విప్, ఎమ్మెల్యే బెందాళం అశోక్ తెలిపారు. శనివారం రామయ్యపుట్టుగలోని పార్టీ కార్యాలయంలో 11 మందికి ఇళ్ల పట్టాలు, 9 మందికి రేషన్ కార్డులను ఆయన అందజేశారు ఈ కార్యక్రమంలో తహశీల్దార్ వెంకటరావు, డీటీ శ్రీహరి, తదితరులు పాల్గొన్నారు.

అడ్డుకుంటున్నారనడం తగదు

కవిటి, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి):లండారిపుట్టుగ పంచాయతీ అభివృద్ధిని ప్రతిపక్షనేత అడ్డుకుంటున్నారని సర్పంచ్ ఆవేదన వ్యక్తం చేయడం తగదని పంచాయతీకి చెందిన రామస్వామి, నీలకంఠం, ఆనంద్, చంద్రయ్య, వెంకటరావు అన్నారు. ఈ మేరకు పత్రికలకు శనివారం ప్రకటన విడుదల చేశారు. సర్పంచ్‌గా ఎన్నికైన నాటి నుంచి ఒక్కపని కూడా సక్రమంగా చేయకుండా ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో పంచాయతీ ప్రజలను మభ్యపెట్టటానికి ప్రకటనలు ఇవ్వటం భావ్యం కాదన్నారు. ఉపాధి హామీ పథకంలో పనులు చేయించుకోలేక సర్పంచ్ తన అసమర్థతను కప్పిపుచ్చుకోవటానికి ఇలా మాట్లాడటం తగదన్నారు. తన అసమర్థతను ఎదుటి వ్యక్తిపై మోపి కాలం గడపాలనుకోవటం తగదన్నారు. పంచాయతీ ప్రజలు అన్నీ గమనిస్తున్నారని, మభ్యపెట్టే పనులు చేస్తామంటే సహించేది లేదన్నారు.

ఆదిత్యాలయంలో స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర

అరసవిల్లి, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యప్రదాత అరసవల్లి సూర్యనారాయణ స్వామివారి దేవస్థానంలో శనివారం ఉదయం స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈవో వై.భద్రాజీ ఆధ్వర్యంలో ఆలయ పరిసరాలను సిబ్బందితో కలిసి అధికారులు శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించండి



బడుల్లో చేరిన విద్యార్థులతో హెచ్‌ఎం నరేంద్రనాథ్

ఇచ్ఛాపురం, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): బడి ఈడు పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించాలని కొళిగాం జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం నరేంద్రనాథ్ పట్నాయక్ అన్నారు. అడ్మిషన్ డ్రైవ్‌లో భాగంగా శనివారం బొడ్డబడ నుంచి 21మంది విద్యార్థులను, కొళిగాం, కీర్తిపురం, పాయితారి పంచాయితీ పరిధిలోని పాఠశాలల నుంచి 36మంది, అరకబద్ర పాఠశాల నుంచి 12 మంది విద్యార్థులను కొళిగాం జడ్పీ ఉన్నత పాఠశాలలో చేర్పించామని హెచ్‌ఎం తెలిపారు.

రైతులకు అభ్యంతరమైతే చెప్పండి



మాట్లాడుతున్న తహశీల్దార్ రాంబాబు

ఆమదాలవలస, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): బలసలరేవు వంతెన అప్రోచ్ రోడ్డు భూసేకరణలో రైతులకు ఎటువంటి అభ్యంతరాలు ఉన్నా తెలియజేయాలని తహశీల్దార్ ఎస్.రాంబాబు కోరారు. శనివారం ఇసుకలపేట గ్రామంలో రెవెన్యూ అధికారులు భూ సేకరణ విషయమై గ్రామసభను నిర్వహించారు. నాగావళి నదీ తీరంలో బ్రిడ్జి కోసం అప్రోచ్ రోడ్డుకు అవసరమైన భూసేకరణ పూర్తి చేసినట్టు తెలియజేశారు. దీనిపై రైతులకు అభ్యంతరాలు ఉంటే తమకు ఫిర్యాదు చేయాలని తహశీల్దార్ సూచించారు. ఈ సమావేశంలో భూసేకరణ ప్రత్యేక తహశీల్దార్ పి.శ్రీనివాసరావు, సర్వేయర్ బొడ్డేపల్లి గోవిందరావు, ఆర్ఐ పప్పల గోవిందరావు, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

జూనియర్ కళాశాలను సందర్శించిన డీవీఈవో



విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న డీవీఈవో

సోంపేట, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : సోంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలను జిల్లా వృత్తివిద్యాశాఖాధికారి ఎస్.తవిటి నాయుడు శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా కళాశాల అడ్మిషన్ల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులతో స్వర్ణాంధ్ర -స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎ.మోహనరావు, అధ్యాపకులు పి.రజనీ కుమారి, రామినాయుడు, యుగంధర్, సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

దోషులను కఠినంగా శిక్షించాలి



కాంగ్రెస్ భవన్ ఎదుట ధర్నా చేస్తున్న బీజేపీ నాయకులు

అరసవల్లి, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): నేషనల్ హెరాల్డ్ కుంభకోణంలో దోషులైన సోనియాగాంధీ, రాహుల్ గాంధీలను వెంటనే అరెస్టు చేయాలని భారతీయ యువమోర్చా జిల్లా అధ్యక్షుడు బూర్లె నరేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక ఇందిరా విజ్ఞాన్ భవన్ ఎదుట శనివారం బీజేపీ నాయకులతో కలిసి ధర్నా నిర్వహించారు. దోషులను కఠినంగా శిక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు సిరిపురపు తేజేశ్వరరావు, నాయకులు పైడి వేణుగోపాలం, శవ్వాన ఉమామహేశ్వరి, శవ్వాన వేంకటేశ్వరరావు, పండి యోగీశ్వరరావు, ఎస్.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఏసు బోధనలు విశ్వవ్యాప్తం

సరుబుజ్జిలి, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): ఏసుక్రీస్తు బోధనలు విశ్వవ్యాప్తంగా విస్తరించాయని రాష్ట్ర క్రిస్టియన్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం అధ్యక్షుడు జి.శామ్యూల్ అరుణ్‌కుమార్ తెలిపారు. స్థానిక పెంతకోస్తే చర్చి పాస్టర్ శామ్యూల్‌జాన్ ఆధ్వర్యంలో రన్‌ఫర్ జీసెస్ పేరుతో శనివారం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాస్టర్లు సంసోన్, అహరోన్‌రాజు, అదపాక రామారావు, సాల్మన్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రన్ ఫర్ జీసస్

రణస్థలం, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): ఏసు పునరుత్థానం సందర్భంగా శనివారం పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో రన్ ఫర్ జీసస్ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో త్రిమోతి, బవిరి రమణ, ఎం.ఇశ్రాయేలు, వి.సరేష్ పాల్గొన్నారు.

ఎలక్ట్రానిక్ వ్యర్థాల వినియోగంపై అవగాహన

ఇచ్ఛాపురం, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): పాడైన ఎలక్ట్రానిక్ పరికరాలను వృథా చేయకుండా మున్సిపాల్టీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన ఈవేస్ట్ కలెక్షన్ పాయింట్‌కు అందజేయాలని మున్సిపల్ కమిషనర్ ఎన్.రమేష్ అన్నారు. ఈచెక్ ఈ వేస్ట్ అనే కార్యక్రమంలో భాగంగా శనివారం మున్సిపల్ కార్యాలయం ఆవరణలో ఈ-వేస్ట్ కలక్షన్ సెంటర్‌ను కమిషనర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎలక్ట్రానిక్ గూడ్స్ సేల్స్ అండ్ సర్వీసెస్ యజమానులతో సమావేశం నిర్వహించారు. ఈ వేస్ట్ కలెక్షన్ ఆవశ్యకతను వివరించారు. ప్రతి బుధవారం ఈవేస్ట్ కలక్షన్ డే నిర్వహిస్తామని చెప్పారు. పాడైన మొబైల్స్, టీవీలు, చార్జర్లు, కంప్యూటర్లు హాస్పిటల్ రోడ్‌లో ఉన్న లైబ్రరీ వద్ద ఏర్పాటు చేసిన ఈ-వేస్ట్ కలెక్షన్ సెంటర్ వద్ద సేకరిస్తున్నట్టు తెలిపారు. అనంతరం షాపుల నుంచి పాడైన ఎలక్ట్రానిక్ పరికరాలను సేకరించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ కాళ్ల దిలీప్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఉపేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

నవధాన్యాల సాగుతో మేలు



నవధాన్యాలను ప్రదర్శిస్తున్న దృశ్యం

ఆమదాలవలస, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): నవధాన్యాలు సాగు చేసి నేలతల్లిని కాపాడుకుందామని ప్రకృతి వ్యవసాయ డీపీఎం పూజారి సత్యనారాయణ అన్నారు. శనివారం చేపేనపేట యూనిట్ పరిధిలో 30 రకాల విత్తనాలతో కిట్లు తయారు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, పాల్గొన్నారు.

యూపీ పాఠశాలల మూసివేతకు యత్నం

గార, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 1200 యు.పి.పాఠశాలల మూసివేతకు ప్రభుత్వం రంగం సిద్ధం చేస్తోందని ఎస్.టి.యు. జిల్లా అధ్యక్షులు ఎస్.వి.రమణమూర్తి అన్నారు. శనివారం బలరాంపురంలో ఉపాధ్యాయులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యారంగాన్ని చక్కదిద్దుతామని ఒక పక్క ప్రకటనలు చేస్తూ మరో వైపు పాఠశాలలను కుదించేందుకు ప్రణాళికలు రచిస్తున్నారని ఆయన ఆరోపించారు. ఈ సమావేశంలో పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మహిళ దారుణ హత్య


భవాని(ఫైల్)

రణస్థలం,ఏప్రిల్19(ఆంధ్రజ్యోతి):మండలంలోని గొల్లపేట గ్రామానికి చెందిన ఆవాల భవాని (22) పైడిభీమవరం జంక్షన్ సమీపాన ఉన్న ఒకచెరువు వద్ద శనివారం సాయంత్రం హత్యకు గురైంది. పోలీసుల కథనం మేరకు..ఆవాల భవాని పైడిభీమవరంలోని ఓ హోటల్‌లో పనిచేస్తోంది. సాయంత్రం విధులు పూర్తయిన తరువాత ఇంటికి వెళ్తున్న సమయంలో గుర్తు తెలియని వ్యక్తి కత్తితో ఆమె మెడపై తీవ్రంగా దాడి చేసి..పరారయ్యాడు. దీంతో ఆమె అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయింది. మృతి చెందిన భవానికి రోహిత(2) అనేకుమార్తె ఉంది.భర్త వెంకటసత్యం లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ప్రస్తుతం ఆయన ఒడిశాలో ఉన్నాడు. చెరువు వద్దనున్న భవాని మృతదేహాన్ని చూసి స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి జేఆర్‌పురం సీఐ ఎం.అవతారం, ఎస్ఐ ఎస్.చిరంజీవి, క్లూస్ టీమ్ చేరుకుని పరిశీలిస్తున్నారు. భవాని ఎలా హత్యకు గురైంది. కారణాలేమిటనే దానిపై పోలీసులు ఆరాతీస్తున్నారు.మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాకుళంలోని రిమ్స్‌కు తరలించారు. భవాని సోదరుడు బమ్మిడి సాయి ఇచ్చిన ఫిర్యాదు మేరకు జేఆర్‌పురం ఎస్ఐ ఎస్.చిరంజీవి కేసు నమోదు చేశారు

600 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం

మెళియాపుట్టి, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని భరణికోట, బాలేరు, మర గ్రామాల్లో శనివారం దాడులు నిర్వహించి సుమారు 600 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసినట్లు టెక్కలి ఎక్సైజ్ సీఐ మీరా సాహెబ్ తెలిపారు.దీంతో పాటు 20 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. దాడులో ఎస్ఐ పిన్నింటి రమేష్‌బాబు తదితరులు ఉన్నారు.

ఉపాధ్యాయుడి అదృశ్యంపై ఫిర్యాదు

పొందూరు, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): పొందూరు గాంధీనగర్ వీధికి చెందిన ఉపాధ్యాయుడు బుగత రమణ అదృశ్యమయ్యాడని భార్య సంతోషి ఫిర్యాదు మేరకు ఎస్ఐ వి. సత్యనారాయణ శనివారం కేసు నమోదుచేశారు. విజయనగరం జిల్లాలోని లక్ష్మీపురం ప్రభుత్వపాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నట్లు తెలిపారు. శుక్రవారం సాయంత్రం 7.30 గంటల సమయంలో బయటకు వెళ్ళి తిరిగిరాలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు.

ప్రోటోకాల్ పాటించకపోవడంపై నిరసన

వజ్రపుకొత్తూరు, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): అధికారిక కార్యక్రమాల్లో ప్రోటోకాల్ పాటించడంలేదని వైసీపీకి చెందిన ఎంపీటీసీలు,సర్పంచ్‌లు నిరసన తెలిపారు. శనివారం ఎంపీపీ ఉప్పరపల్లి నీలవేణి అధ్యక్షతన జరిగిన మండల సమావేశం నుంచి ఎంపీటీసీలు,సర్పంచ్‌లు వాకౌట్‌చేశారు. దీంతో కోరం లేకపోవడంతో సభకొంత ఆలస్యంగా ప్రారంభమైంది.తొలుతవ్యవసాయం, విద్యుత్, హౌసింగ్ శాఖలకు సంబంధించి అంశాలపై చర్చ జరిగింది. అనంతరం మండల ప్రత్యేక ఆహ్వానితుడు ఉదయకుమార్ మాట్లాడుతూ అధికారిక కార్యక్రమాలలో వైసీపీకి చెందిన ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లకు అధికారులు గుర్తించడంలేదని, కనీసం ప్రోటోకాల్ పాటించడం లేదని పేర్కొని సభనుంచి వాకౌట్ చేస్తున్నట్లు ప్రకటించారు. దీనికి ఎంపీపీ నీలవేణి మద్దతు తెలియజేసి ముకుమ్మడిగా సభ నుంచి వాకౌట్ చేశారు.కాగావైసీపీకి చెందిన కోఆప్షన్ సభ్యుడు భాస్కర్‌రెడ్డి వాకౌట్ చేయకుండా సభలోనే ఉండిపోవడం విశేషం.

ఆ భూములు ల్యాండ్ సీలింగ్ పరిధిలో లేవు

పాతపట్నం, ఏప్రిల్19(ఆంధ్రజ్యోతి):పాసిగంగుపేట రెవెన్యూ పరిధిలో సర్వే నెంబర్ 58లోగల ఎ.14.22సెంట్ల భూములు ల్యాండ్‌సీలింగ్ చట్టం పరిధిలో లేవని తహసీల్దార్ ఎస్.కిరణ్‌కుమార్ తెలిపారు.తమ భూములు ల్యాండ్ సీలింగ్ పరిధిలోలేవని పేర్కొని పాసిగంగుపేటకు చెందిన బాడాన తాతబాబు, బాడాన సత్యం కుమారుడు బాడాన పూర్ణచంద్రకిషోర్ తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. కొందరు నిరాధారమైన అభియోగాలతో ఇబ్బందులకు గురిచేస్తున్నారని, వారి నుంచి రక్షణకల్పించాలని కోరారు.

కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుల నియామకం

జలుమూరు, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): నరసన్నపేట నియోజకవర్గంలోని కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులను జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అంబటి కృష్ణారావు నియమించినట్లు నియోజకవర్గ ఇన్‌చార్జి మామిడి సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీ జలుమూరు మండలాధ్యక్షుడిగా కొండా కేశవరావు, సారవకోట మండలాధ్యక్షుడిగా ఉర్జాన దాలయ్య, నరసన్నపేట మండలాధ్యక్షుడిగా గుండ అప్పారావు, పోలాకి మండలాధ్యక్షుడిగా కొంకి అప్పన్నను నియమించినట్లు పేర్కొన్నారు. పార్టీ నరసన్నపేట పట్టణాధ్యక్షుడిగా గుత్తు కృష్ణమోహన్, జిల్లా ప్రధాన కార్యదర్శిగా డి.మధుసూదనరావు, జిల్లా ఉపాధ్యక్షులుగా రావాడ సుదర్శనరావు, జిల్లా కార్యదర్శిగా భేరి వెంకటరమణ, నియమించినట్లు తెలిపారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

జలుమూరు, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి):నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ జె.రామారావు హెచ్చరించారు. శనివారం మండలంలోని హరికృష్ణమ్మపేట వద్ద నిర్వహిస్తున్న శ్రీవిజయలక్ష్మి ట్రేడర్స్ ఫైర్ కాకర్స్ గొడౌన్‌ను పరిశీలించారు. గొడౌన్‌లో గల సరుకులు, స్టాకు రిజిస్టరును తనిఖీ చేశారు. కార్య క్రమంలో ఎస్ఐ అశోక్‌బాబు, అగ్నిమాపక కేంద్రం అధికారి పీఆర్.రెడ్డి, ఆర్ఐ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

మందసలో సామూహిక సీమంతాలు

హరిపురం ఏప్రిల్19 (ఆంధ్రజ్యోతి): మందస ఐసీడీఎస్ కార్యాలయంలో శనివారం పోషణపక్వాడా కార్యక్రమంలో భాగంగా పీవో వసుంధరాదేవి ఆధ్వర్యంలో గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు రామలక్ష్మి, మంగమ్మ, జయలక్ష్మి పాల్గొన్నారు.

●జలుమూరు, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి):శ్రీముఖలింగం అంగనవాడీ కేంద్రంలో శనివారం పోషణ పక్షోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అంగనవాడీ కార్యకర్తలు చంద్రకళ, మాలతిదేవి, భవాని గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకుంటే ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు.

●మెళియాపుట్టి, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): పెంగువాడలో పోషణ పక్వడా కార్యక్రమం నిర్వహించారు. కార్య క్రమంలో అంపురం కార్యదర్శి పి.తవిటినాయుడు, సర్పంచ్ జమ్మయ్య, మేనక, సంతోష్, నీలు, జయశ్రీ పాల్గొన్నారు.

పీహెచ్‌సీ స్థలంలో ఆక్రమణల తొలగింపు

హిరమండలం, ఏప్రిల్19(ఆంధ్రజ్యోతి):స్థానిక బ్యారేజీ సెంటర్ సమీపంలో గల పీహెచ్‌సీ స్థలంలోని ఆక్రమణలను రెవెన్యూ సిబ్బంది తొలగించారు. ఇటీవల పీహెచ్‌సీకి చెందిన సుమారు ఐదె సెంట్ల స్థలంలో కొంతమంది ఆక్రమించేందుకు స్తంభాలు పాతారు.ఈవిషయం తెలుసుకున్న రెవెన్యూ అధికారులు దర్యాప్తు నిర్వహించారు.ఆక్రమణకు పాలపడింది ఎవరన్నది తెలియరాలేదు. కాగా శనివారం రెవెన్యూ సిబ్బంది స్తంభాలను తొలగించారు.

రెసిడెన్షియల్ కళాశాలలు ఏర్పాటు చేయాలి

మెళియాపుట్టి, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): గిరిజన ఆశ్రమపాఠశాలల్లో రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలు ఏర్పాటు చేయాలని మాజీ ఎంపీపీ బైరిశింగి లక్ష్మీనారాయణ కోరారు.శనివారం మెళియాపుట్టిలో విలేకరులతో మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం గిరిజన విద్యావ్యవస్థను చిన్నాభిన్నాం చేయడం వల్ల గిరిజన విద్యార్థులు ఉన్నతవిద్యకు దూరమయ్యారని తెలిపారు.మంత్రులు రామ్మోహన్ నాయుడు, అచ్చెన్నాయుడు,ఎమ్మెల్యే ఎంజీఆర్‌కు విన్నవించినట్లు తెలిపారు.

జనసేన కార్యకర్తలకు ఉజ్వల భవిష్యత్

రణస్థలం, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి):పార్టీ బలోపేతానికి కృషి చేసిన ప్రతి కార్యకర్తలకు ఉజ్వలభవిష్యత్ ఉంటుందని జనసేనజిల్లా అధ్యక్షుడు పిసిని చంద్రశేఖర్ తెలిపారు.శనివారం రణస్థలం జనసేన క్రియాశీలక సభ్యత్వ కిట్లను పంపిణీచేశారు.ఎచ్చెర్ల నియోజకవర్గంలో నాలుగో విడత క్రియాశీలక సభ్యత్వాలు 800పై చిలుకు చేసి మొదటి స్థానంలో నిలిచిన లావేరు మండలం జనసేననాయకుడు కాకర్ల బాబాజీకి సభ్యత్వ కిట్లు అందజేశారు. కార్యక్రమంలో నియోజకవర్గం ఇన్‌చార్జి విశ్వక్సేన్, భూపతి అర్జున్, జిల్లా కార్యదర్శి వడ్దాది శ్రీను, పైడిరాజు, బలరామ్ పాల్గొన్నారు.

రాళ్లు వేశారు.. రోడ్డు మరిచారు


గోవిందపుట్టుగ జంక్షన్ వద్ద రోడ్డుపై రాళ్లకుప్ప

●ప్రమాదాలకు నిలయంగా మారిన వైనం
●ఇదీ జగతి-శిలగాం రహదారి దుస్థితి

కవిటి, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జగతి-శిలగాం రహదారి మరమ్మతుల్లో భాగంగా గోతులు పూడ్చి రాళ్లు పేర్చారు. అయితే రోడ్డు వేయడం మరచిపోవడంతో ప్రమాదాలకు నిలయంగా మారింది. వాహనచోదకులు, పాదచారులు, ప్రయాణికులకు అగచాట్లు తప్పడంలేదు. నెలలు గడుస్తున్నా పనులు పూర్తి కాకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు.

జగతి-శిలగాం మీదుగా జాతీయరహదారిని కలుపుతూ పదికిలోమీటర్లు మేర తారురోడ్డు అడుగడుగునా గోతులమయమయ్యింది.వైసీపీ హయాంలో కనీస స్థాయిలో మరమ్మతులకు నోచుకోలేదు. ఈనేపథ్యంలో టీడీపీ ప్రభుత్వం ఈఏడాది ప్రారంభంలో మరమ్మతులకు నిధులు మంజూరు చేసింది.దీంతో జగతినుంచి పెద్దఎర్రగోవిందపుట్టుగ వరకురోడ్డులో ఏర్పడిన గోతులు తవ్వి మెటల్‌రాళ్లు వేసి వదిలేశారు. నిత్యం రద్దీగా ఉండే ఈ రోడ్డులో మెటల్ రాళ్లుతేలిపోవడంతో వాహనదారులు ఇబ్బందిపడుతున్నారు. గోవిందపుట్టుగ జంక్షన్‌లో పనుల నిమిత్తం వేసిన రాళ్లు రోడ్డుపైనే ఉండడంతో రాత్రివేళల్లో ప్రమాదాలుజరుగుతున్నాయని ఎర్రబాసుదేవ్ ప్రదాన్ తదితరులు ఆవేదన వ్యక్తంచేశారు.ఈరోడ్డులో మలుపుల వద్ద ఇరువైపుల జంగిల్ క్లియరెన్స్ చేయకపోవడంతో ఎదురెదురుగా వాహనాలు వచ్చే సమ యంలో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. రోడ్డు మరమ్మతులు పూర్తి చేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోండి

●స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో పిలుపు

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని వక్తలు పిలుపు నిచ్చారు. శనివారం జిల్లాలో స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు అధికారులు, ప్రజా ప్రతినిధులు మాట్లాడుతూ తమ ఇళ్లతో పాటు ప్రభుత్వ కార్యాలయాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పిలుపునిచ్చారు.
-ఆంధ్రజ్యోతి బృందం



పాతపట్నం: ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే మామిడి గోవిందరావు


జలుమూరు: పీహెచ్‌సీ ఆవరణలో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి


ఆమదాలవలస: స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞచేయిస్తున్న ఎమ్మెల్యే రవికుమార్

ప్రతి ఒక్కరికీ టీడీపీలో గుర్తింపు: ఎమ్మెల్యే

పాతపట్నం, ఏప్రిల్19 (ఆంధ్రజ్యోతి): టీడీపీలో ప్రతిఒక్కరికీ గుర్తింపు ఉంటుందని పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు తెలిపారు. శనివారం స్థానిక క్యాంపుకార్యాలయంలో సీది సర్పంచ్ బోనుగిరి ఆధ్వర్యంలోసుమారు 100కుటుంబాలు వైసీపీ నుంచి టీడీపీలో చేరాయి.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీని నమ్ముకొన్నవారికి అన్యాయం జరగదని తెలిపారు. సర్పంచ్ బోను గిరి మాట్లాడుతూ మాజీఎమ్మెల్యే రెడ్డి శాంతి నియంతృత్వధోరణి భరించలేక టీడీపీలో చేరినట్లు తెలిపారు.

ఊయలలో వేయండి

పిల్లలు వద్దనుకొనేవారు ఊయలలో వేయాలని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు సూచించారు. పాతపట్నంలోని 50 పడకల సామాజిక ఆసుపత్రిలో ఊయల కార్యక్రమాన్ని ప్రారంభించారు.తొలుతపంచాయతీకార్యాలయంలో జరిగిన పౌష్టికాహార మాసోత్సవంలో పాల్గొని గర్భిణులకుసామూహిక సీమంతాలు నిర్వహించారు. కార్యక్రమాలలో సీహెచ్‌సీ వైద్యాధికారి గిడుతూరి వేణుగోపాలరావు, ఐసీడీఎస్ పీవో టి.విమలారాణి, టీడీపీ నాయకులు పైల బాబ్జీ, సైలాడ సతీష్, శివాల చిన్నయ్య పాల్గొన్నారు.

మార్కెట్ అభివృద్ధికి సహకరించాలి

నరసన్నపేట, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): నరసన్నపేట మార్కెట్ అభివృద్ధికి సహకరించాలని స్థానిక వర్తక సంఘ ప్రతినిధులు ఉణ్న వెంకటేశ్వరరావు, జామి వెంకటరావు, వి. కేశవరాజు కోరారు.ఈ మేరకు శనివారం ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తికి క్యాంపు కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. జూనియర్ కాలేజీ జంక్షన్ నుంచి మార్కెట్ వరకు రోడ్డు విస్తరణ చేపట్టి బజారువీధిలో మార్కెట్ అభివృద్ధికి నిధులు మంజూరు చేయించాలని వర్తకులు కోరారు. కాగా వచ్చేనెల ఏడో తేదీ నుంచి జరిగే నరసన్నపేట వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలకు ఆలయ ధర్మకర్త పొట్నూరు కృష్ణప్రసాద్, మావుడూరి జగదీశ్వరశర్మ, చామర్తి కృష్ణమాచార్యులు ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తికి ఆహ్వానించారు.

సమస్యలపై నివేదిక ఇవ్వండి

●పలాస నియోజకవర్గ టీడీపీ సమన్వయకర్త వెంకన్నచౌదరి


మాట్లాడుతున్న వెంకన్నచౌదరి

పలాస, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి):సమస్యలపై నివేదిక ఇవ్వాలని పలాస నియోజకవర్గ టీడీపీ సమన్వయకర్త యార్లగడ్డ వెంకన్న చౌదరి కోరారు. శనివారం పలాస టీడీపీ కార్యాలయంలో నియోజకవర్గ అభివృద్ధి, సమస్యలు, పరిష్కారమార్గాలపై రౌండ్ టేబుల్ సమావేశం బీజేపీ, జనసేన, టీడీపీ నాయకులతో నిర్వహించారు. ఈసందర్భంగా వెంకన్నచౌదరి మాట్లాడుతూ రాష్ట్రంలోనే అభివృద్ధి చెందిన నియోజకవర్గంగా ముందుకు తీసుకువెళ్లడానికి కృషి చేస్తున్నామని తెలిపారు. వైసీపీ పాలనకంటే ప్రజలు సంతోషంగా ఉన్నారని చెప్పారు. కొత్త ప్రాజెక్టుల రూపకల్పన, విద్యాలయాలు, ఆసుపత్రుల ఆధునికీకరణ, స్కిల్‌డెవలప్‌మెంట్ కార్యక్రమాల నిర్వహణ, యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడంపై చర్చించారు. కార్యక్రమంలో నియోజకవర్గంలో ఉన్న అన్ని మండలాలు, మునిసిపాలిటీ నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వపాఠశాలల్లో చేరేలా చర్యలు తీసుకోండి

కోటబొమ్మాళి, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): గామాల్లో బడిఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేరేవిధంగా చర్యలు తీసుకోవాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు లండ బాబురావు కోరారు. శనివారం కోటబొమ్మాళిలో ఉపాధ్యాయులతో కలిసి గోడ పత్రికను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘ నాయకులు గొండు నారాయణరావు, వాసుదేవరావు పాల్గొన్నారు.

సర్దార్ సేవలు చిరస్మరణీయం


వజ్రపుకొత్తూరు:లచ్చన్న విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు

స్వాతంత్ర్య సమరయోధుడు సర్దార్ గౌతు లచ్చన్న సేవలను చిరస్మరణీయమని వక్తలు కొనియాడారు. శనివారం జిల్లాలో లచ్చన్న వర్ధంతి పురస్కరించుకుని పలుచోట్ల ఆయన చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి ఆయనచేసిన సేవలు గుర్తుచేసుకున్నారు.

●కోటబొమ్మాళి ఏప్రిల్19(ఆంధ్రజ్యోతి):బడుగు బలహీనవర్గాల కోసం అలుపెరగని పోరాటం చేసిన గొప్పఉద్యమకారుడు సర్దార్ గౌతు లచ్చన్న అని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. నిమ్మాడలోని తనకార్యాలయంలో గౌతు లచ్చన్న 19వ వర్ధంతిని పురస్కరించుకొని నివాళులర్పించారు.

●నరసన్నపేట, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి):నరసన్నపేటలో జరిగిన కార్యక్రమంలో నియోజకవర్గ శ్రీశయన సంఘనాయకులు తోట చంద్రమోహన్‌దేవ్, రాష్ట్ర కల్లుగీత సంఘ ప్రధాన కార్యదర్శి దుబ్బ కోటేశ్వరరావు, సంఘ నాయకులు దంత త్రినాథరావు, డొంకాన అసిరినాయుడు, వంజల రామరాజు, కోల రాము, బతకల గోపి,సరియపల్లి మధు, డొంకాన మణి పాల్గొన్నారు.

●వజ్రపుకొత్తూరు, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): రెయ్యిపాడులోని గౌతు లచ్చన్న విగ్రహానికి టీడీపీ మండలాధ్యక్షులు సూరాడ మోహనరావు, అగ్నికులక్షత్రియ డైరక్టర్ పుచ్చ ఈశ్వరరావు తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

●పలాస, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): పలాసలోని కేటీరోడ్డులో గల సర్దార్ గౌతు లచ్చన్న విగ్రహానికి టీడీపీనాయకులు పూలమాలలువేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పలాస నియోజకవర్గ టీడీపీ సమన్వయకర్త యార్లగడ్డ వెంకన్నచౌదరి, ఏపీటీపీసీ చైర్మన్ బాబూరావు,కామేశ్వరరావుయాదవ్, విఠల్‌రావు పాల్గొన్నారు.

●సోంపేట, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి):సర్దార్ గౌతు లచ్చన్న వర్ధంతి సందర్భంగా సోంపేటలోని ఆయన ఘాట్ వద్ద నివాళులర్పించారు. మాజీ మంత్రి గౌతుశివాజీ, విజయమ్మతో కలసి కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, విప్ బెందాళం అశోక్‌లు లచ్చన్న విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.

● కంచిలి, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): మఠం కంచిలిలోని లచ్చన్న విగ్రహానికి శనివారం పూలమాలలు వేసి టీడీపీ నాయకులు నివాళులర్పించారు.కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు బంగారు కురయ్య, టీడీపీ మండల ప్రచార కార్యదర్శి జగదీష్ పట్నాయక్, మురళీ పట్నాయక్, కొర్రాయి కురయ్య, పైల మన్మథరావు, లండ లోకనాథం, జగన్నాథరావు పాల్గొన్నారు.

●హరిపురం ఏప్రిల్19 (ఆంధ్రజ్యోతి):మందస, హరిపురం కూడళ్లలో గౌతు లచ్చన్న వర్ధంతిని నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు బావన దుర్యోధన, నాయకులు జీకే నాయుడు, లబ్బ రుద్రయ్య, దాసరి తాతారావు, రట్టి లింగరాజు,గున్నయ్య, బమ్మిడి కర్రయ్య, భాస్కరరావు, పుల్లా వాసు పాల్గొన్నారు.

లక్ష్యాలను పూర్తిచేయాలి

నందిగాం, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పలు కార్యక్రమాల లక్ష్యాలను పూర్తిచేయాలని ఎంపీడీవో టి.రాజారావు కార్యదర్శులకు సూచించారు. శనివారం స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో పంచాయతీలు వారీగా మనమిత్ర, వాట్సాప్ గవర్నెన్స్, స్వమిత్ర, ఇంటిపన్ను వసూళ్లు తదితర అంశాలపై సమీక్షించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

వజ్రపుకొత్తూరు, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): పూండి సబ్‌స్టేషన్ పరిధిలో కొత్తబ్రేకర్లు ఏర్పాటు చేయనుండడంతో ఆదివారం ఉదయం పది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ట్రాన్స్‌కో ఈఈ యజ్ఞేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. పూండి, పీఎంపురం, అమలపాడు, కేఆర్‌పేట, కొత్తపేట, దేవునల్తాడ, పాతటెక్కలిల పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు.

27 నుంచి వాలీబాల్ పోటీలు

నరసన్నపేట, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): యారబాడులో నీలమ్మతల్లి ఆలయ ప్రతిష్ఠోత్సవం పురస్కరించుకుని ఈనెల 27 నుంచి రెండు రోజుల పాటు జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహక కమిటీ సభ్యులు రమణ, కన్నబాబు, సురేష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల జట్లు 9848402828 నెంబర్‌కు సంప్రదించాలని కోరారు.

జాబ్‌మేళాలో 34 మంది ఎంపిక

టెక్కలి, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జేకేసీ, వేకెంట్ షైర్ ఆధ్వర్యంలో శనివారం జరిగిన జాబ్‌మేళాకు 34 మంది పలు కంపెనీల్లో ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.గోవిందమ్మ తెలిపారు. జాబ్‌మేళాకు 72 మంది నిరుద్యోగులు హాజరయ్యారు. ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు ఆమె నియామక పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో జేకేసీ కో-ఆర్డినేటర్ డాక్టర్‌బి.సతీష్‌కుమార్, హెచ్‌ఆర్ మేనేజర్ బి.ఝాన్సీరాణి, సీహెచ్ శ్రీధర్, శాంతనకుమార్, కసవయ్య, పాపారావు తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ బోర్డుల ఏర్పాటు

సోంపేట, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): సోంపేట రైల్వే స్టేషన్‌లోని ముడు ఫ్లాట్‌ఫారాల్లో 75 కోచ్ నెంబర్లు తెలిపే డిజిటల్ బోర్డులు ఏర్పాటుచేసినట్లు సీనియర్ రైల్వే కమర్షియల్ మేనేజర్ ఎస్.అనిల్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. కోచ్ నెంబర్లు తెలిపే బోర్డు వల్ల ప్రయాణికులకు మేలు జరుగుతుందని, రైలు ఆగిన సమయంలో కోచ్ నెంబర్లు ఆధారంగా ఎక్కడానికి అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఒక్కో ఫ్లాట్‌ఫారమ్‌లో 25 బోర్డులు చొప్పున ఏర్పాటు చేశామని తెలిపారు.

జేఈఈ మెయిన్‌లో సత్తాచాటిన విద్యార్థులు

జిల్లాలోని పలువురు విద్యార్థులు జేఈఈ మెయిన్‌లో సత్తాచాటారు. ఎన్‌టీఏ విడుదల చేసిన ఫలితాల్లో ఓపెన్, ఓబీసీ కేటగిరిల్లో పలువురు ఉత్తమ ర్యాంకులు సాధించారు.

పలాసలో..


ఎం.బాలవర్ధన్


బి.జయంత్

పలాస, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): పలాసకు చెందిన ఎం.బాలవర్ధన్ జాతీయస్థాయిలో జెఈఈ మెయిన్ ఫలితాల్లో ఓపెన్ కేటగిరిలో 1435, బి.జయంత్ 1796 ర్యాంకు సాధించారు.

మొగిలిపాడు విద్యార్థికి..


రోహిత్

హరిపురం ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): మందస మండలంలోని మొగిలిపాడుకు చెందిన నూకల రోహిత్ జేఈఈ మెయిన్‌లో ఓబీసీ విభాగంలో 965 ర్యాంకు సాధించాడు. తండ్రి హేమసుందర్ ఫోటోగ్రాఫర్ కాగా పనిచేస్తున్నాడు. తల్లి గృహిణిగాఉంది. రోహిత్‌కు ఏపీఎన్జీవో అధ్యక్షుడు బి.గోపాల్‌తోపాటు ఉపాధ్యాయులు అభినందించారు.

తిలక్‌నగర్ విద్యార్థికి


స్నేహిత

కాశీబుగ్గ, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): కాశీబుగ్గలోని తిలక్‌నగర్‌కు చెందిన మల్లా శ్రీనివాస్‌రావు, మీనాకుమారి కుమార్తె మల్లా స్నేహితకు జేఈఈమెయిన్‌లో 99.80 పర్సంటైల్‌తో ఆల్ ఇండియా ఓపెన్ కేటగిరిలో 3115 ర్యాంకు సాధించింది. తల్లిదండ్రులతో పాటుపలువురు అభినందించారు.

నరసన్నపేట విద్యార్థికి..


బి.వెంకటచైతన్య

నరసన్నపేట, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): నరసన్నపేటలోని మారుతీనగర్-4లో నివాసముంటున్న బొంతల వెంకట చైతన్య జేఈఈ మెయిన్‌లో ఓపెన్ కేటగిరి విభాగంలో 4,993 ఓబీసీలో 1010వ ర్యాంకు సాధించాడు. తల్లిదండ్రులు ఎల్లమ్మ, వెంకటరమణ ఉపాధ్యాయులు. వెంకట చైతన్య విశాఖలో ఇంటర్ చదివాడు.

రెంటికోట విద్యార్థి..


కె.సాయిఅనీష్

పలాస రూరల్, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని రెంటికోట గ్రామానికి చెందిన కుశిరెడ్డి సాయిఅనీష్ జేఈఈ మెయిన్‌లో జాతీయ స్థాయి ఆల్‌ఇండియా ర్యాంకు 7234, ఓబీసీ కేటగిరిలో 1560 ర్యాంకు సాధించాడు. 99.56 పర్సంటైల్ స్కోరు సాధించినట్లు తండ్రి గంగాధరరావు తెలిపారు.

సోంపేటలో 1018వ ర్యాంక్..


ఎస్.మోక్షలలిత

సోంపేట, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన సానా మోక్షలలిత జేఈఈ మెయిన్‌లో 99.46 పర్సంటైల్‌తో ఓబీసీ కోటాలో 1018వ ర్యాంకు సాధించింది. లలితకు కుటుంబసభ్యుల తోపాటు గ్రామస్థులు అభినందించారు.

గొర్లెపేట విద్యార్థి


రోనిత్రాంనాయుడు

రణస్థలం, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గొర్లెపేట గ్రామానికి చెందిన ముల్లు రోనిత్రాంనాయుడు జేఈఈ మెయిన్‌లోఆల్ ఇండియా ఓపెన్ ర్యాంకు 2282, ఓబీసీలో 414 ర్యాంకు సాధించారు. తండ్రి ముల్లు శ్రీనివాసరావు జి.సిగడాం ఎంఈవోగా విధులు నిర్వహిస్తున్నారు. తల్లి మజ్జి మోహిని టెక్కలి మండలం చాకిపల్లిలో ఉపాధ్యాయినిగా పనిచేస్తోంది.

ఆసుపత్రిలో ప్రసవాల సంఖ్య పెంచాలి

హరిపురం ఏప్రిల్19 (ఆంధ్రజ్యోతి):ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవాల సంఖ్య పెంచాలని డీఎంఅండ్‌హెచ్‌వో సునీత కోరారు. శనివారం మందస పీహెచ్‌సీలో రికార్డులు, మందులు, వ్యాక్సిన్ గదులను పరిశీలించారు. ఆసుపత్రిలో అందుతున్న సేవలపై రోగులను అడిగితెలుసుకున్నారు. ఆసుపత్రిలో వైద్యులు, సిబందితో సమీక్షించారు. కార్యక్రమంలో వైద్యులు మద్దిల సంపతిరావు, ఈవో కృష్ణారావు, పీహెచ్‌ఎన్ పెంటమ్మ, ఆప్తమాలిక్ అధికారి ఆర్ .వెంకటరమణ, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన

కోటబొమ్మాళి, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి):స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో సిబ్బంది, నర్సులకు శనివారం అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అగ్ని మాపక సిబ్బంది కె. రామారావు, బి. బాలకృష్ణ పాల్గొన్నారు.

పాఠశాలకు మైక్ సెట్ వితరణ

సంతబొమ్మాళి,ఏప్రిల్19(ఆంధ్రజ్యోతి): మండలంలోని బోరుభద్ర జడ్పీ ఉన్నత పాఠశాలకు విద్యా కమిటీ చైర్మన్ గన్నవరపు గోవిందరావు రెండు టెంట్లు అందజేశారు. శ్రీకృష్ణాపురానికి చెందిన పూర్వ విద్యార్థులు మైక్ సెట్‌ను వితరణగా ఇచ్చారు.ఈ మేరకు వారికి హెచ్‌ఎం రామకృష్ణ అభినందించారు.

కొత్తరేవు పాఠశాల వార్షికోత్సవం

పోలాకి, ఏప్రిల్19(ఆంధ్రజ్యోతి):మండలంలోని కొత్తరేవు యూపీస్కూల్ 106వ వార్షికోత్సవాన్ని హెచ్‌ఎం వై.గోవిందరావు అధ్యక్షతన శనివారం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ అర్జిల రాజేశ్వరీవిష్ణు, ఎంపీటీసీ బర్రితవిటమ్మ, స్కూల్‌కాంప్లెక్స్ చైర్మన్‌లు ఆర్.లక్ష్మి, సదాశివుని శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కేవిటీలను ఓబీసీలో చేర్చండి

వజ్రపుకొత్తూరు,ఏప్రిల్19(ఆంధ్రజ్యోతి): నువ్వలరేవులోని కేవిటీలను ఓబీసీలో చేర్పించాలని సర్పంచ్ మువ్వల పూర్ణ, ఎంపీటీసీ మాజీ సభ్యులు ఆనంద్, వెంకటేష్, మాజీ కోఆప్షన్ సభ్యులు వెంకటరమణ కోరారు. ఈ మేరకు పలాసలో కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడికి వినతిపత్రం అందజేశారు.